క్లుప్తంగా

రేపు కలికిరిలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం

కలికిరి: మండలంలోని రాజువారిపల్లి వద్ద అజయ్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల మండల కన్వీనర్ చింతల రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలం నుంచి జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి పార్టీ, అనుబంధ విభాగాలలో నియామకాలకు సంబంధించి నూతన కమిటీ సభ్యులను మాజీ ఎమ్మెల్యే చింతల చేతుల మీదుగా సన్మానిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

శివాలయం సేవకుడి వితరణ


హాట్ బాక్సులను అందజేస్తున్న పట్టాభి రామయ్య

పెద్దతిప్పసముద్రం : శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య పుట్టిన రోజు సందర్భంగా శనివారం అన్నదానం చేపట్టారు. శివాలయంలో నిత్య పూజలు, సేవా కార్యక్రామాలకు హాజరయ్యే 50 మంది భక్తులకు హాట్‌బాక్సుల తోపాటు మిఠాయిలు అందజేసి దాతృత్వం చాటుకున్నారు. నిత్య పూజలు, అభిషేకాలు, అన్నదానం చేయిస్తున్న పట్టాభిరామయ్యను భక్తులతోపాటు గ్రామస్థులు అభినందించారు.

ఆలయాల్లో శ్రావణ శోభ


అలంకరణలో ప్రసన్న వెంకటరమణస్వామి


మదనపల్లె సిటీ : పట్టణంలో శ్రావణ మాస సందడి నెలకొంది. మూడో శనివారం కావడంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక దేవళంవీధి ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు గోవర్ధన్ భట్టార్ అభిషేకాలు చేశారు. గోవింద నామాలతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు అన్న సంతర్పణ జరిగింది. స్థానిక బసినికొండ వెంకటరమణస్వామి ఆలయంలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. బెంగళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలమంలో స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్ద వరాల ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామిని జామపండ్లతో అలంకరించి పూజలు చేశారు.

ఘనంగా జంధ్యాల పౌర్ణమి


పూజలు చేస్తున్న పురోహితులు

మదనపల్లె సిటీ : శ్రావణ పౌర్ణమి సందర్భంగా కురవంకలోని శంకరబ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో శనివారం జంధ్యాల పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పురోహితులు శ్రీనివాసరావుచే యజ్ఞోపవీత ధారణ చేయించారు. శ్రావణ పౌర్ణమి విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శంకరబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కోదండరామయ్య, గౌరవాధ్యక్షుడు ప్రసాదరావు, ఆడిటర్ ప్రసాదరావు, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కలికిరి(వాల్మీకిపురం) : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని డిప్యూటీ హెచ్‌ఈఓ మహమ్మద్ రఫీ అన్నారు. వాల్మీకిపురం మండలం విఠలంలో శనివారం లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణకు సహకరించిన వైద్యులు, ప్రోత్సహించిన కుటుంబసభ్యులు నేరస్తులవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రెడ్డెమ్మ, సీసీ.రెడ్డెప్ప, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


అనీల్‌కుమార్

కలికిరి: కలికిరి అప్‌గ్రేడ్ స్టేషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా ఎస్.అనిల్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలకడ సీఐగా ఉన్న ఈయన్ను సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలు డీఐజీ కలికిరికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం కలికిరిలో విధులలో చేరారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు.

బోర్డులు సరే...
ఆక్రమణల తొలగింపు ఏదీ?



అరిగెలవారిపల్లెలో ఏర్పాటు చేసిన హెచ్చరికబోర్డు


ఆక్రమణలను పరిశీలించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్(ఫైల్)

గుర్రంకొండ : ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. కలెక్టర్ పరిశీలించి ఆక్రమణలను తొలగించాలని సూచనలు చేసినా.. హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసి రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకొన్నారు. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ అరిగెలవారిపల్లెలో సర్వే నెంబర్ 26/2లో మొత్తం 10.10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇది మేత బీడు పోరంబోకు భూమి. సదరు భూమిలో ప్రభుత్వ నిబంధనలు మేరకు ఎవరికీ పట్టాలివ్వకూడదు. అయితే ఇటీవల కొంతమంది వ్యక్తులు ఈ భూమిని ఆక్రమించి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారు. భూమిని తమ ఆధీనంలో ఉంచుకొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు గత నెల 14న స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్ స్వయంగా గత నెల 15న గ్రామంలో ఆక్రమణలను పరిశీలించారు. రికార్డుల ప్రకారం భూములున్నా ఆక్రమించుకొని పలువురు ఇళ్ల నిర్మాణాలు, కంచెలు వేసినట్లు గుర్తించారు. ఆక్రమణదారులు ఆవలి వైపు ఇళ్లకు వెళ్లే దారులను కూడా కబ్జా చేసినట్లు గుర్తించారు. ప్రభుత్వ భూములపై సర్వేచేసి మూడు సెంట్లు స్థలం ఉంచి మిగిలిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. మిగతా భూముల్లో కంచె వేసి స్వాధీనం చేసుకోవాలని కబ్జాకు గురైన స్థలాలపై సర్వే చేసి మేత బీడు పోరంబోకు స్థలం చుట్టూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ ఆక్రమణలను పరిశీలించి 25 రోజులు గడుస్తున్నా ఇంతవరకు రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. సర్వే చేయడం కానీ, ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వడం గానీ, ఆక్రమణలు తొలగించడం గానీ చేయలేదు. గ్రామస్తులు ఫిర్యాదు చేసిన దారి సమస్య కూడా పరిష్కరించక లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇవేవీ చేపట్టకుండా కేవలం ఓ వైపు ఖాళీగా ఉన్న స్థలంలో హెచ్చరికబోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వేచేసి చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆక్రమణలపై సర్వే చేస్తాం

తొందరలోనే భూ ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేసి పూర్తి స్థాయిలో సర్వే చేస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు దారిసమస్యతోపాటు ఇతర వాటిపై చర్యలు చేపడతాం. ప్రస్తుతానికి హెచ్చరికబోర్డు ఏర్పాటు చేశాం.

– సదాశివప్పనాయుడు, ఆర్ఐ, గుర్రంకొండ

అభివృద్ధిపై ఎక్కడైనా చర్చకు సిద్ధం

వైఎస్సార్‌సీపీ నాయకుల సవాల్


సమావేశంలో మాట్లాడుతున్న జయసింహారెడ్డి

తంబళ్లపల్లె : నియోజకవర్గంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషి ఎంతో ఉందని, టీడీపీ నాయకులు అవాకులు, చెవాకులు పేలకుండా అభివృద్ధిపై చర్చించేందుకు రావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సవాల్ విసిరారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జయసింహారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కె.ఆర్.మల్‌రెడ్డి, మల్లయ్యకొండ పాలకమండలి మాజీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి వందల కోట్ల నిధులు తెచ్చి రోడ్లు, సీసీరోడ్లు, సాగునీరు, తాగునీటి సమస్యలు తీర్చి కళ్లకు కనబడే విధంగా అభివృద్ధి చేశారన్నారు. గోపిదిన్నెలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ నిర్మించడం జరిగిందని, 2.34 టీఎంసీల సామర్థ్యంతో ముదివేడు రిజర్వాయర్ నిర్మించడమేగాక, గండికోట నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించేందుకు మొలకలచెరువు మండలం సోంపల్లి పంచాయతీ గట్టుకిందపల్లెవద్ద 0.6 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టు చేపట్టి 80 శాతం పూర్తి చేశారని తెలిపారు. ఆ పనులను కోర్టుల ద్వారా నిలుపుదల చేసిన ఘనత టీడీపీ నాయకులదేనని ఎద్దేవా చేశారు. 13 సబ్ స్టేషన్లు తెచ్చి అందులో ఆరు సబ్ స్టేషన్లకు రూ.1.20 కోట్లు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిస్తే.. కూటమి ప్రభుత్వం రద్దుచేసి కుప్పానికి తరలించిందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి రద్దు కాలేదని చెప్పగలడా అని వారు ప్రశ్నించారు. గోపిదిన్నె పంచాయతీలో రూ.5 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, అత్యధికంగా 630 మందికి పెన్షన్లు ఇస్తుంటే.. ఒక కొత్త పెన్షన్ ఇవ్వలేని దుస్థితి ప్రభుత్వానిదే అన్నారు. మల్లయ్యకొండకు వెళ్లి అక్కడ జరిగిన రోడ్లు, ఆలయ పునర్నిర్మాణం, జరుగుతున్న పనులు కళ్లారా చూసి మళ్లీ మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, కురబలకోట మండల మహిళా అధ్యక్షురాలు నక్కా రమాదేవి, సురేంద్రనాథ్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

మదనపల్లె : మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పరిధిలోని బుద్ధునికొండ(నల్లగుట్ట)పై జరిగిన ఘటనల నేపథ్యంలో నూతన విగ్రహం ఏర్పాటుకు ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి అని తహసీల్దారు కిశోర్‌కుమార్‌రెడ్డి, తాలూకా సీఐ కళావెంకటరమణ అన్నారు. మీడియాతో వారు మాట్లాడుతూ ఈ నెల 23న కొత్తగా బుద్ధుని విగ్రహం ప్రతిష్ఠించనున్నట్టు బాస్ నేతలు సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. దీనికి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, నల్లగుట్టపై రెవెన్యూ శాఖ తరపున ఫెన్సింగ్ వేయడం జరిగిందని చెప్పారు. ప్రైవేటు వ్యక్తులు ఎవరైనా కార్యకలాపాలు నిర్వహించుకోవాలంటే కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

మెగా వైద్య శిబిరం


విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మదనపల్లె సిటీ : స్థానిక చిత్తూరురోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో స్విమ్స్ ఆధ్వర్యాన శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. స్విమ్స్ నుంచి అప్తాలమిక్, యూరాలజీ, గైనకాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ డాక్టర్లు విద్యార్థులను పరీక్షించారు. అవసరమైన వారిని వైద్య పరీక్షల కోసం సిఫార్సు చేశారు. ప్రిన్సిపల్ ఎం.గీత మాట్లాడుతూ మెగా మెడికల్ క్యాంపునకు మంచి స్పందన లభించినట్లు తెలిపారు. చాలామంది విద్యార్థులు కంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వేలాయుధన్, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో కలిగే నష్టాలపై ఖైదీలకు అవగాహన


ఖైదీలకు అవగాహన కల్పిస్తున్న జైలర్ లక్ష్మణరావు, సీఐ భీమలింగ

మదనపల్లె రూరల్ : పట్టణంలోని సబ్ జైలులో శనివారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కేర్ (కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్) కమిటీ సమావేశం శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మదనపల్లె సబ్ జైలు సూపరింటెండెంట్ లక్ష్మణ్ రావు, ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆల్కహాల్, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ మద్యం, మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తు, జీవితాలను నాశనం చేసుకుంటున్న వారిసంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సమాజంలో మార్పురావాలని, మత్తుకు బానిసలు కావద్దని ప్రభుత్వం కేర్ కమిటీ ఏర్పాటుచేసిందన్నారు. పట్టణాలతోపాటు గ్రామాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని, వాటికి అలవాటుపడి విద్యార్థులు, యువత విలువైన జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేయడంతోపాటు మరణం అంచుల వరకూ తీసుకెళ్తాయన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, నాటుసారా విక్రయాలపై ఎక్సైజ్‌శాఖకు సమాచారం ఇచ్చి సమాజాన్ని రక్షించాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణాపై ఫిర్యాదు కోసం డయల్ 1972 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ ర్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఏ.డార్కస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళలు

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డికి కురబలకోట మండలం మహిళా అధ్యక్షురాలు నక్కా రమాదేవి రాఖీ పండగ సందర్భంగా రాఖీ కట్టి ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాఖీ పౌర్ణమి


రాఖీ పౌర్ణమి సందర్భంగా నిసార్‌అహ్మద్‌తో కేక్ కట్ చేయిస్తున్న మహిళలు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాఖీపౌర్ణమి వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త నిసార్ అహ్మద్‌కు రాఖీ కట్టి, అభిమానాన్ని, ఆప్యాయత, సోదరభావాన్ని చాటుకున్నారు. దుశ్శాలువాతో సత్కరించి ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ అందరికీ రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. సోదర, సోదరీమణుల మధ్య అనుబంధాన్ని ఈ పండగ గుర్తుచేస్తోందన్నారు. రాఖీ అంటే రక్షణ అని అర్థమని, సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని, ఎల్లవేళలా అండగా, రక్షణగా ఉండాలని ఆకాంక్షిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేసి, ప్రతి పథకంలోనూ సముచిత గౌరవం కల్పించారన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు, కార్యకర్తలు రాఖీ కట్టి వేడుక జరపడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు బీరంగి రేవతి, నాగమణి, శారదారెడ్డి, వినుతాభాయి, అమ్మాజాన్, షమా, యూనస్, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, చరణ్, మహేష్, మల్లికార్జున, కొత్తపల్లె మహేష్, శంకర్ నాయక్, జబీవుల్లా, యాసిన్, ఖిజర్‌ఖాన్, బావాజాన్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

బోరు వేశారు.. మోటారు మరిచారు


అలంకారానికే పరిమితమైన బోరు

ప్రజల తాగునీటి అవసరాల కోసం జూన్ 12న స్థానిక బి.కొత్తకోట రోడ్డులో బోరు వేశారు. మండల గ్రాంట్ ద్వారా వేసిన బోరులో నీరు పుష్కలంగా ఎగసిపడింది. బోరు వేసి రెండు నెలలు కావస్తున్నా మోటారు, పైపులు అమర్చడంలో అధికారులు విఫలమయ్యారు. మండ్లావారిపల్లిలో ప్రభుత్వ తాగునీటి బోరులో నీరు రాక ఎండిపోయింది. సదరు పల్లెలో 20 కుటుంబాల ప్రజలు నీటికోసం పరితపిస్తున్నా అధికారులెవరూ పట్టించుకోకపోవడం శోచనీయం. పల్లెకు సమీపంలోనే కొత్తగా వేసిన బోరుద్వారానైనా తాగునీటి సమస్య తీరుతుందని భావించిన ప్రజలకు కన్నీళ్లే మిగిలాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజల కనీస అవసరాలను గుర్తించి బోరులో మోటారు అమర్చి తాగునీటి సమస్య తీర్చాల్సిన అవసరం ఉంది.

– పెద్దతిప్పసముద్రం

మా గోడు పట్టించుకోరా ?


నివాస గృహాల నడుమ రోడ్డు దుస్థితి

పెద్దతిప్పసముద్రం : స్థానిక శివాలయం ఎదురుగా మురికి కాలువలు, సిమెంటు రోడ్లు, తాగునీటి పైప్‌లైన్ వంటి కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నీటి కోసం మెయిన్ రోడ్డులోని కుళాయి వద్దకు రావాల్సి వస్తోందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసినప్పుడు ఆరు బయట వెళ్లాలన్నా బురదలో పడి లేస్తూ నరకయాతన అనుభవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవోకు పలుమార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదుచేసినా తమగోడు పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆ సంఘం నాయకులు

పీలేరు : గిరిజన యానాది సేవా సంఘం, ఆదివాసీ ఎరుకల సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గిరిజన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన సమావేశంలో గిరిజన సంఘం నేతలు మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం గిరిజనుల చరిత్ర, సంప్రదాయాలను గుర్తుచేసే రోజు అన్నారు. గిరిజన పూర్వీకులు అడవులు, నదులు, పర్వతాలతో కలిసి జీవించేవారని, ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతలో గిరిజనుల పాత్ర అపారమైందని అన్నారు. కాలక్రమంలో గిరిజనులు భూములు, వనరులు, జీవనాధారం కోల్పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. యువత విద్య, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ముందుండాలని, అలాగే గిరిజన సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉద్బోధించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సెలవు రోజుగా ప్రకటించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు గడ్డం శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు జానంగంగిరెడ్డి, ఆదివాసీ ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసవర్మ, నాయకులు కిల్లా విజయ్‌కుమార్, సావిత్రమ్మ, క్రాంతి కుమార్, నారాయణమ్మ, రెడ్డెప్ప, ఆదినారాయణ, ఈశ్వరయ్య, లోకేష్, చంద్రయ్య, ప్రదీప్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

దివ్య ఖురాన్ చదివి ఆచరించాలి


మాట్లాడుతున్న మౌలానా అబ్దుల్ ఆలీం ఉమ్రి

గుర్రంకొండ : ప్రతి ఒక్కరూ దివ్య ఖురాన్ గ్రంథాన్ని చదివి అందులోని విషయాలను అర్థం చేసుకొని తప్పక ఆచరించాలని జమాతే ఇస్లామీ-హిందే రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అబ్దుల్ ఆలీం ఉమ్రి అన్నారు. మండలంలోని ఖండ్రిగ గ్రామంలోని మీర్‌మహమూద్‌ఆలీ ఆవరణంలో ఆత్మ ప్రక్షాళన శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతిమ దైవ గ్రంథం ఖురాన్ అన్నారు. ఇందులోని ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకొంటే సమాజంలో ఎలా మసలుకోవాలో అర్థమవుతుందన్నారు. దివ్య ఖురాన్‌లో వివాహాలను తక్కువ ఖర్చుతో చేయాలని, వడ్డీ రహిత సమాజాన్ని స్థాపించాలని సూచించారన్నారు. మత్తు, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మౌలానా ఇమాదుల్లా హుస్సేనీసాహెబ్, డాక్టర్ అబ్దుల్లాఖాన్ సాహెబ్, జిల్లాశాఖ అధ్యక్షుడు ఆజం ఆలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కక్ష పూరితంగానే ఎంపీని అరెస్టు చేశారు


ఆంజనేయస్వామికి టెంకాయలు కొడుతున్న నాయకులు

పెద్దతిప్పసముద్రం : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై కూటమి నాయకులు కక్ష పూరితంగా అక్రమ కేసు పెట్టి ఆత్మ సంతృప్తి పొందుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. మిథున్‌రెడ్డిని విడుదల చేయాలని కోరుతూ మద్దయ్యగారిపల్లి ఆంజనేయస్వామి విగ్రహం ఎదుట వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో 101 టెంకాయలు కొట్టి పూజలు చేశారు. అనంతరం శూలాల గంగమ్మ ఆలయంలో హారతులు పట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ లిక్కర్ కేసులో మిథున్‌రెడ్డిపై ఎలాంటి ఆధారాల్లేకున్నా అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. పథకాలు అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలతో రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యగా అభివర్ణించారు. అంచెలంచెలుగా ఎదుగుతున్న పెద్దిరెడ్డి కుటుంబాన్ని అణగదొక్కేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నిందని ఆరోపించారు. జైలులో సౌకర్యాల విషయంలో ఎంపీని ఇబ్బందులకు గురిచేస్తూ హైకోర్టు ఉత్తర్వులను బేఖాతర్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహమూద్, వైస్ ఎంపీపీ శోభాశంకర్, నాయకులు కల్లేగారి మంజు, మెకానిక్ చంద్ర, మేకల చంద్ర, గువ్వల విశ్వనాథ్, పాకపట్ల మధు, రాంబాబు, షేర్వా, పీఎల్ఆర్ భాస్కర్, దీపాల వెంకట్రమణ, దండు శీనా, ఫుజేల్, బాబు, జాకీర్, వసీం, పూల శివప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం


తరిగొండలో స్వామికి విశేష పూజలు

పెద్దతిప్పసముద్రం : శ్రావణ శనివారంలో భాగంగా స్థానిక చిన్న ఆంజనేయ స్వామి ఆలయంలో గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట వందలాది మంది భక్తులతో పాటు పాదచారులు, వాహనాల్లో వెళ్ళేవారికి అన్నదానం చేశారు.

లక్ష్మీ నరసింహుడికి..

గుర్రంకొండ : మండలంలోని గుర్రంకొండ, తరిగొండ గ్రామాల్లో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో స్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. టీటీడీ వారి ఆధ్వర్యంలో తరిగొండ ఆలయంలో శనివారం ఉదయాన్నే స్వామికి అభిషేకాలు, తోమాల సేవ, ఏకాంతసేవ గావించారు. రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. చారిత్రాత్మక గుర్రంకొండ కోటలోని నృసింహస్వామి ఆలయంలో వేకువజామున అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున ఆలయాలకు చేరుకొని స్వామివార్లను దర్శించుకొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.


కేసులు పెట్టడమే
కూటమి ప్రభుత్వ లక్ష్యం


పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న చింతల రామచంద్రారెడ్డి

కలకడ : కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ప్రారంభమైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. కలకడ శ్రీనివాసరెడ్డి కాంప్లెక్స్‌లో శనివారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ క్యూర్ కోడ్‌ను ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే తెలుస్తాయని, ఎవరిని అడిగానా హామీ అమలు చేయలేదనే సమాధానం వస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం, అక్రమ అరెస్టులు చేయడంపైనే 14 నెలల కూటమి ప్రభుత్వ పాలన సాగిందన్నారు. రాజంపేట ఎంపీ పీవీ.వెంకట మిథున్‌రెడ్డిని అక్రమ కేసులో అరెస్ట్ చేసి 22 రోజులు అయినా విడుదలచేయక పోవడం దారుణమన్నారు. పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతీయడానికే కూటమి నేతలు కేసులు నమోదు చేయిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబునాయుడికి సమానంగా నిలబడే ధైర్యం కలిగిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని దెబ్బతీయడం తగదన్నారు. స్థానిక ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవి, జిల్లా రాజగోపాల్‌రెడ్డి, ఈశ్వర్‌నాయుడు, శాంతమ్మ, రామచంద్ర, కమలాకర్‌రెడ్డి, మల్లేశ్వరి, అలీఖాన్, ద్వారకనాథరెడ్డి, కెఎస్.మస్తాన్, వెంకటప్రసాద్‌రెడ్డి, కరీముల్లా, ఆదిత్యరాం, హరినాథరెడ్డి, జీవీ.కిశోర్, లక్ష్మిరెడ్డి, అంజన్‌కుమార్, మోహన్‌రాజ నాయుడు, సురేష్‌నాయక్, బసిరెడ్డి, కుమార్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వెంకటేశ్వరనాయుడు, కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జిలానీ బాషా, హరినాథ, చిన్న, జశ్వంత్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, గుర్రప్ప, నీళ్ళరవి, లక్ష్మన్న పాల్గొన్నారు.

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం


సీఐ గోపాల్‌రెడ్డి


సీఐ వెంకటేశ్వర్లు

బి.కొత్తకోట : రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి హార్సిలీహిల్స్‌కు వచ్చే పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామని సీఐ కే.గోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సీఐగా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి వీఆర్‌లో ఉన్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేయగా ఇక్కడ పనిచేస్తున్న జీవన్ గంగనాథ్‌బాబును నంద్యాల వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఘాట్‌రోడ్డుపై విన్యాసాలు, మందుబాబులు అల్లరి చేస్తూ పర్యాటకులకు ఇబ్బంది కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ సీఐగా వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాల్లో అసాంఘిక కార్యకలాపాలు, జూదం, నాటుసారా, ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టడానికి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రజా సమస్యలపైన తక్షణం స్పందిస్తానని సీఐ అన్నారు.